
సాక్షి ఒడిశా

శనివారం । 6 । ఏప్రిల్ । 2024



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

నగదు	రూ.4,58,457
బంగారం	800 మిల్లీ గ్రాములు
వెండి	40 గ్రాములు

- భువనేశ్వర్/పూరీ



భానుడు భగభగ

రాష్ట్రంలో వాతావరణం నిప్పుల కుంపటిని తలపిస్తోంది. ఉదయం పూట సైతం గడప దాటడం భయానకంగా పరిణమించే పరిస్థితులు ఆవహించాయి.

-IIలో.

రంజాన్ వేళలు

ఇఫ్తార్	సెహరి
శని	ఆది
6.08	4.21

న్యూస్‌రీల్

విద్యార్థినులకు అస్వస్థత



చికిత్స పొందుతున్న విద్యార్థినులు

రాయగడ: జిల్లాలో పద్మపూర్ సమితి బహుపాదారా గ్రామంలోని ప్రభుత్వ బాలికల ఆశ్రమ పాఠశాలలో చదువుతున్న 11 మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. ఈ ఆశ్రమ పాఠశాల రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ విభాగం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. విద్యార్థులను వెంటనే సమీపంలోని ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. వివరాల్లోకి వెళ్తే.. ఎప్పటిలాగే విద్యార్థినులంతా శుక్రవారం మధ్యాహ్నం భోజనాలు చేసిన అనంతరం, వారి గదుల్లోకి వెళ్లి విశ్రాంతి తీసుకుంటున్న సమయంలో వాంతులు, విరేచనాలు ప్రారంభమయ్యాయి. దీంతో పాఠశాల నిర్వాహకులు వెంటనే వారిని ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం వారి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్లు వైద్యులు తెలియజేశారు. అయితే ఒకేసారి ఇంతమంది అస్వస్థతకు గురవ్వడానికి గల కారణాలు తెలియలేదు.

ఎన్నికల బరిలో తండ్రీ కొడుకులు



భక్త చరణ్ దాస్



సాగర చరణ్ దాస్

భువనేశ్వర్: కలహండి జిల్లాలో తండ్రీ, కొడుకులు ప్రత్యక్ష ఎన్నికల పోరుకు బరిలోకి దిగుతున్నారు. వీరిరువురు ఒకే పార్టీ సంబంధించి వేర్వేరు స్థానాల నుంచి పోటీ చేయడం విశేషం. కాంగ్రెస్ అధిష్ఠానం వీరికి ఈ అవకాశం కల్పించింది. వీరే భక్త చరణ్ దాస్, ఆయన కుమారుడు సాగర చరణ్ దాస్. భక్త చరణ్ దాస్ కేంద్ర మాజీ మంత్రి, రాష్ట్ర కాంగ్రెస్ ఎన్నికల ప్రచార కమిటీ అధ్యక్షుడు. ఆయన నౌర్లా నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేయనున్నారు. ఆయన కుమారుడు సాగర్ చరణ్ దాస్ భవానీపట్న శాసనసభ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా ఖరారవ్వడం విశేషం. ఇద్దరూ గత ఎన్నికల్లో అపజయం పాలయ్యారు. గత ఎన్నికలో భక్త చరణ్ దాస్ కాంగ్రెస్ అభ్యర్థిగా కలహండి లోక్‌సభ స్థానం నుంచి పోటీ చేశారు. సాగర్ చరణ్ దాస్ కలహండి జిల్లా భవానీపట్న నియోజకవర్గం నుంచి రాష్ట్ర శాసనసభకు పోటీ చేశారు. ఇరువురు ఈ పోటీలో పరాజయం పాలయ్యారు. మరో మారు వీరు తమ అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు బరిలోకి దిగుతున్నారు.

బీజేడీ మరో జాబితా విడుదల

భువనేశ్వర్: రాష్ట్ర శాసనసభ ఎన్నికలు పురస్కరించుకుని అధికార పక్షం బిజూ జనతా దళ్ విడతల వారీగా అభ్యర్థుల జాబితాలు విడుదల చేస్తోంది. దీనిలో భాగంగా శుక్రవారం మూడో జాబితాను విడుదల చేసింది. ఈ జాబితాలో 9 నియోజకవర్గాలకు అభ్యర్థులను ఖరారు చేసింది. ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ వీడియో సందేశంలో వివిధ స్థానాలకు పార్టీ అభ్యర్థుల పేర్లను ప్రకటించారు. బీజేడీ తాజాగా ప్రకటించిన శాసనసభ నియోజకవర్గాల్లో రెండు ప్రముఖ అసెంబ్లీ నియోజకవర్గాలు రౌర్కెలా, బారాబటి కటక్ ఉన్నాయి. రౌర్కెలాకు శారదా నాయక్, బారాబటి - కటక్‌కు ప్రకాష్ బెహెరాను బీజేడీ రంగంలోకి దించింది. గత నెల 27న తొలి జాబితాలో 72 మంది, ఈనెల 3న రెండో జాబితాలో 27 మంది అభ్యర్థులతో బీజేడీ శాసనసభ జాబితా ప్రకటించిన విషయం తెలిసిందే. తాజాగా 9 మందిని ప్రకటించడంతో రాష్ట్రంలో సమగ్రంగా 147 శాసనసభ నియోజకవర్గాల్లో బీజేడీ 108 స్థానాలకు అభ్యర్థులను ప్రకటించింది. ఈ లెక్కన మరో 39 నియోజకవర్గాలకు అభ్యర్థులను ప్రకటించాల్సి ఉంది.

నియోజకవర్గం	అభ్యర్థి
రౌర్కెలా	శారదా నాయక్
బారాబటి - కటక్	ప్రకాష్ బెహెరా
రెంగాలి	సుదర్శన్ హరిపాల్
బీరమిత్రపూర్	రోహిత్ జోసెఫ్ టిర్కీ
కెంజొహర్	మీనా మాఝీ
రాయ్‌రంగపూర్	రైసిన్ ముర్ము
బాలాసోర్	స్వరూప్ దాస్
సాలేపూర్	ప్రశాంత్ బెహెరా
జయదేవ్	నవ కిషోర్ మల్లిక్

ఆరోగ్య యోగం




యోగా శిక్షణలో పాల్గొన్న విద్యార్థులు

- సెంచూరియన్ వర్సిటీలో యోగా మహోత్సవం

పర్లాకిమిడిలోని ఆర్.సీతాపురం సెంచూరియన్ వర్సిటీ క్యాంపస్ క్రికెట్ మైదానంలో కేంద్ర ఆయుష్ మంత్రిత్వ శాఖ, మొరార్జీదేశాయ్ జాతీయ యోగా ఇన్‌స్టిట్యూట్ సహకారంలో సెంచూరియన్ వర్సిటీ భాగస్వామ్యంతో యోగా మహోత్సవ్–2024ను శుక్రవారం ప్రారంభించారు. జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకుని 77 రోజుల కౌంట్ డౌన్ కోర్సులో సెంచూరియన్ విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీపీఎం సౌమ్యరాణి గౌడో మాట్లాడుతూ యోగాతో శారీరక, మానసిక ఆరోగ్యం లభిస్తుందని తెలియజేశారు. ప్రతి ఒక్కరూ యోగా చేయాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం రాష్ట్రంలోని వివిధ వర్సిటీ విద్యార్థుల యోగా ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో వర్సిటీ రిజిస్ట్రార్ డా.అనితా పాత్రో, ప్రభుత్వ జిల్లా ప్రోగ్రామ్ మేనేజర్ సౌమ్యరాణీ గౌడో, డైరెక్టర్ (అడ్మిన్) డా.దుర్గాప్రసాద్ పాఢీ, యోగా గురువులు ప్రొఫెసర్ ప్రఫుల్ల కుమార్ పండా, ప్రొఫెసర్ బాలాజీ పాఢి, ప్రొఫెసర్ జ్ఞానేంద్ర కుమార్ మిశ్రా, ప్రొఫెసర్ ప్రదీప్ కుమార్ సాహు తదితరులు పాల్గొన్నారు. – పర్లాకిమిడి



యోగా మహోత్సవ్ ప్రారంభిస్తున్న డీన్ డా.అనితా పాత్రో



పర్లాకిమిడి సెంచూరియన్ వర్సిటీ విద్యార్థుల ప్రదర్శన



పూరీ నుంచి విచ్చేసిన యోగా శిక్షకులు



పూరీ శ్రీజగన్నాథ యూనివర్సిటీ విద్యార్థుల ప్రదర్శన



డీపీఎం సౌమ్యరాణి గౌడోకు జ్ఞాపిక అందజేస్తున్న డీన్ అనితా పాత్రో



ప్రొఫెసర్ ప్రఫుల్ల కుమార్ పండాను సన్మానిస్తున్న దృశ్యం



కటక్ శ్రీశ్రీ యూనివర్సిటీ విద్యార్థుల ప్రదర్శన



భువనేశ్వర్ ఎస్‌వోఏ విశ్వ విద్యాలయం విద్యార్థులు

• విశ్రాంత కార్మికుల ధర్నా



ధర్నాలో పాల్గొన్న కార్మికులు

జయపురం: సమితి పరిధి గగనాపూర్‌లోని సేవా పేపర్ మిల్లు యాజమాన్యం బిజినెస్ బదిలీ ఒప్పదం అమలు చేయాలని కోరుతూ మిల్లు వద్ద శుక్రవారం ఉదయం విశ్రాంత కార్మికులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా కార్మిక నేత ప్రమోద్ కుమార్ మహంతి మాట్లాడుతూ జిల్లా లేబర్ అధికారులు కార్మికుల సమస్యలు పరిష్కరించాలని మిల్లు యాజమాన్యానికి ఆదేశించినా, యాజమాన్యం నిమ్మకునీరెత్తనట్లు వ్యవహరిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. 2020 నుంచి మిల్లు నూతన యాజమాన్యం బిజినెస్ బదిలీ ఒప్పందాన్ని అమలు చేయలేదని మండిపడ్డారు. ఇప్పటివరకు విశ్రాంత కార్మికులు, మరణించిన వారి కుటుంబాలకు చెల్లించాల్సిన బకాయలు చెల్లించలేదని ఆరోపించారు. బిజినెస్ బదిలీ ఒప్పందం మరుగున పడేసి ఒక ఎంవోయూ చూపుతూ యాజమాన్యం కార్మికులను మోసగిస్తోందని ధ్వజమెత్తారు. అంతేకాకుండా మిల్లులో పనిచేసే కార్మికులకు గత 5 నెలలుగా జీతాలు కూడా చెల్లించటంలేదని వెల్లడించారు. మిల్లు నడిచేందుకు కార్మికులు చిత్తశుద్ధితో పనిచేస్తున్నా, ముడిసరుగు కొరత చూపి మిల్లును సక్రమంగా నడపడం లేదని ఆరోపించారు. విశ్రాంత కార్మికులకు చెల్లించాల్సిన బకాయిలు చెల్లించేవరకు ఈ ఆందోళన కొనసాగుతుందన్నారు. ఆందోళనలో వి.రవికుమార్, బాలకృష్ణ ప్రధాన్, దుర్యోధన పాలెయ్, సుదర్శన్ బిశాయి, ప్రభాకర ప్రహరాజ్, బసంత బెహర, త్రినాథ్ సాహు తదితరులు పాల్గొన్నారు.

పంగి పయనమెటు..?



జయరాం పంగి

జయపురం: కొరాపుట్ జిల్లాలో ఆదివాసీ సీనియర్ నేత, మాజీ ఎంపీ, మాజీ మంత్రి జయరాం పంగి రాజకీయ పరిస్థితి అగమ్యగోచరమైంది. ఆయన ఎన్నో ఆశలతో ఇటీవల కాంగ్రెస్ పార్టీలో చేరారు. ముఖ్యంగా కొరాపుట్ పార్లమెంట్ స్థానానికి గానీ, పొట్టంగి ఎమ్మెల్యే స్థానానికి గానీ టిక్కెట్టు లభిస్తుందన్న ఆశతో ఆ పార్టీ కండువా కప్పుకున్నారు. అయితే కొరాపుట్ ఎంపీ అభ్యర్థిగా సిట్టింగ్ ఎంపీ సప్తగిరి శంకర ఉల్క, పొట్టంగి ఎమ్మెల్యే అభ్యర్థిగా మాజీ ఎమ్మెల్యే రామచంద్ర కడమ్‌లను కాంగ్రెస్ పార్టీ ప్రకటించడంతో పంగి ఆశలు అడియాశలయ్యాయి. కొరాపుట్ పార్లమెంట్ నియోజకవర్గంలో జయరాం పంగి 2009 ఎన్నికల్లో గిరిదారి గొమాంగోపై మొదటిసారి గెలిపొందారు. అదేవిధంగా పొట్టంగి విధానసభ నియోజకవర్గంలో ఆయన 1977, 1990, 2000, 2004లలో ఎమ్మెల్యేగా గెలిపొందారు.

బీజేడీ నుంచి సస్పెండ్ చేయడంతో...

జయరాం పంగి కొరాపుట్ జిల్లా బీజేడీ అధ్యక్షుడిగా దీర్ఘకాలం పార్టీ బలపడేందుకు కృషి చేశారు. అయితే కొన్ని అనుకోని కారణాల వలన పంగిని పార్టీ నుంచి తొలగించడంతో జిల్లాలో రాజకీయంగా నిలదొక్కుకునేందుకు బీజేపీలో చేరారు. అయితే ఆ పార్టీలో తగిన గుర్తింపు లేకపోవడంతో ఆయన గిరిధారి గొమాంగోతో కలిసి హైదరాబాద్‌లో బీఆర్‌ఎస్‌లో చేరారు. అయితే గత అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ తెలంగాణలో ఓటమి చెందడంతో జయరాం పంగి కాంగ్రెస్‌లో చేరారు. కాంగ్రెస్ అతడిని రాష్ట్ర ఆదివాసీ సెల్ అధ్యక్షుడిగా నియమించింది. అయితే ఇటీవల పొట్టంగి నియోజకవర్గంలో అతడి మద్దతుదారులతో సమావేశమైన తర్వాత పార్టీ టిక్కెట్టు కోసం దరఖాస్తు పెట్టుకున్నారు. కానీ ఆయనకు పార్టీ టిక్కెట్టు కేటాయించకపోవడంతో నిరాశ చెందారు. అతడి అనుచరులు మాత్రం స్వతంత్ర అభ్యర్థిగా బరిలోకి దిగమని ఒత్తిడి చేస్తున్నట్లు సమాచారం. అయితే ఒకవేళ స్వతంత్ర అభ్యర్థిగా బరిలో నిలిస్తే పరిస్థితులు ఎలా ఉంటాయోనని ఆలోచనలో పడిపోయారు.

ఎన్నికల ప్రచారంలో భార్యాభర్తలు



భార్య పూజాతో సప్తగిరి ఉలక



ప్రచారంలో కౌసల్య హికక, వెనుక ఆమె భర్త జిన్ను హికక

రాయగడ: సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో కొరాపుట్ లోక్‌సభ స్థానం నుంచి కాంగ్రెస్ పార్టీ తరుపున సిట్టింగ్ ఎంపీ సప్తగిరి శంకర్ ఉలక, అధికార పార్టీ బీజేడీ తరుపున కౌసల్య హికక, అదేవిధంగా బీజేపీ నుంచి కాళీరాం మాఝిల టిక్కెట్లు ఖరారవ్వడంతో ఆయా పార్టీలకు చెందిన నేతలు ఇప్పటికే ప్రచారాలకు శ్రీకారం చుట్టారు. అయితే సప్తగిరి(కాంగ్రెస్) తన ఎన్నికల ప్రచారంలో తన సతీమణి పూజాను వెంట తీసుకొని వెళ్తున్నారు. అదేవిధంగా కౌసల్య(బీజేడీ) తన భర్త జిన్ను హికకను ఎన్నికల ప్రచారానికి తీసుకెళ్తున్నారు. దీంతో ప్రస్తుతం ఈ విషయమే చర్చనీయాంశంగా మారింది. సప్తగిరి సతీమణి పూజాకు ఆదివాసీ భాష రాకపోయినప్పటికీ అందరినీ కలుపుకుంటూ తన భర్తను గెలిపించాలని చిరునవ్వుతో పలకరిస్తూ ప్రచారం ప్రచారం కొనసాగిస్తున్నారు. అదేవిధంగా జిన్ను హికక, కౌసల్యలు కూడా జోరుగా ప్రచారం చేపడుతున్నారు.

ముగ్గురు అటవీ అధికారులకు గాయాలు



జయపురం: గొడొపాదర్ ప్రాంతంలో తగలబడుతున్న అడవులు

జయపురం: స్థానిక అటవీ డివిజన్‌లో అగ్ని ప్రమాదాల నుంచి అడవులను రక్షించడంలో అధికారులు విఫలమవుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో అడవిలో మంటలు ఆర్పేందుకు వెళ్లిన సిబ్బందిలో ముగ్గురు వ్యక్తులు తీవ్రంగా గాయపడిన ఘటన చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. జయపురం అటవీ డివిజన్ పరిధి గొడాపాదర్ అటవీ ప్రాంతంలో చెట్లు తగలబడుతున్నట్లు అటవీ అధికారులకు శుక్రవారం సమాచారం వచ్చింది. దీంతో 8 మందితో కూడిన ఒక బృందాన్ని మంటలను ఆర్పేందుకు పంపారు. ఆ బృందం మంటలను అదుపు చేస్తున్న క్రమంలో అకస్మాత్తుగా అధికంగా గాలులు వీయడంతో మంటలు అన్ని ప్రాంతాలకు వ్యాపించాయి. దీంతో సిబ్బంది మంటల్లో చిక్కుకున్నారు. అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన వచ్చి అతి కష్టంమీద మంటల మధ్య నుంచి వారిని రక్షించారు. తీవ్రంగా గాయపడిన ముగ్గురిని అంబులెన్స్‌లో జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించి చికిత్స అందజేస్తున్నారు. అనంతరం ఎంతో ప్రయాసపడి మంటలను అదుపులోకి తీసుకొచ్చినట్లు అటవీ విభాగ అధికారి సచ్చిదానంద పొరిడ తెలియజేశారు. ప్రమాదంలో అనేక ఔషధ మొక్కలు, విలువైన చెట్లు కాలి బూడిదైనట్లు వెల్లడించారు.

బోండఘట్టీలో మంటలు

మల్కన్‌గిరి: జిల్లాలోని ఖోయిర్‌పూట్ సమితి అంద్రహల్ పంచాయతీలో త్యాగయ్య కొండ ప్రాంతంలో శుక్రవారం మంటలు అంటుకున్నాయి. దీంతో అధికారులకు సమాచారం రావడంతో బలిమెల అగ్నిమాపక సిబ్బంది సాయంతో ఖోయిర్‌పూట్ అటవీ శాఖ అధికారులు మంటలను అదుపు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమన్నారు. ఎవరైనా అడవికి నిప్పు అంటిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.



మల్కన్‌గిరి: మంటలు అదుపు చేస్తున్న అధికారులు

క్లుప్తంగా

పసికందుతో నదిలోకి దూకిన మహిళ

భువనేశ్వర్: భర్తతో గొడవపడి ఓ మహిళ తన 9 నెలల పాపతో నదిలోకి దూకి ఆత్మహత్యా యత్నం చేసింది. ఈ విచారకర ఘటన శుక్రవారం చోటు చేసుకుంది. కేంద్రాపడా జిల్లా గొడా గొడి వంతెనపై నుంచి ఖరస్రోత నదిలోకి దూకింది. ఆలీ పోలీసు ఠాణా పరిధిలోని ఖొందొలో గ్రామానికి చెందిన దంపతులు డొలొ కొంయిదా గ్రామం నుంచి ఆటోలో తిరిగి వస్తుండగా ఈ సంఘటన జరిగింది. ఆటోలో ప్రయాణిస్తువారి మధ్య కుటుంబ కలహాల చర్చ పెచ్చుమీరడంతో ఆ మహిళ వంతెనపై ఆటోను ఆపి కుమార్తెను పట్టుకుని నదిలోకి దూకింది. వారిని రక్షించే ప్రయత్నంలో ఆమె భర్త కూడా అదే అనుసరించాడు. నదిలో ప్రాణాపాయ స్థితిలో కొట్టుమిట్టాడుతున్న ఈ ముగ్గురిని గమనించిన స్థానికులు రక్షించారు. ప్రాణాలతో ఒడ్డుకు చేర్చి సత్వర చికిత్స కోసం ఆలీ సామూహిక ఆరోగ్య కేంద్రం (సీహెచ్‌సీ)లో చేర్చారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం కేంద్రాపడా జిల్లా ప్రధాన ఆస్పత్రికి తరలించారు.

ఒడిశా - ఆంధ్ర సరిహద్దుల్లో తనిఖీలు



వాహన తనికీలు నిర్వహిస్తున్న పోలీసులు

పర్లాకిమిడి: సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తుండడంతో ఒడిశా–ఆంధ్ర సరిహద్దుల్లో విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. పర్లాకిమిడి– చాపర మార్గంలోని రామసాగరం, సీతాసాగరం వద్ద మూడు పాయింట్లు ఏర్పాటు చేసి తనికీలకు పోలీసు సిబ్బందిని నియమించారు. పర్లాకిమిడి ఆదర్శ పోలీసుస్టేషన్ ఐఐసీ అధికారి ప్రశాంత భూపతి మాట్లాడుతూ.. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చెక్ పాయింట్లు ఏర్పాటు చేశామన్నారు. అక్రమంగా నగదు, మద్యం, మారణాయుధాలు రవాణాపై నిఘా పెట్టినట్లు వెల్లడించారు.

అక్రమంగా తరలిస్తున్న కలప పట్టివేత

మల్కన్‌గిరి: జిల్లాలోని బలిమెల అటవీ శాఖ అధికారులు గురువారం రాత్రి జయపురం రహదారిలో పెట్రోలింగ్ నిర్వహించారు. ఈ సమయంలో ఒక ఆటోలో అక్రమంగా తరలిస్తున్న కలపను పట్టుకున్నారు. కలపను ఆంధ్రప్రదేశ్‌లోని సీలేరుకు తరలిస్తున్నట్లు తెలుస్తోంది. కలపతో పట్టుబడిన నిందితులు వంతల భాస్కరరావు, కోరా ఆదినాథ్‌లు సీలేరుకు చెందినవారిగా గుర్తించారు. వీరిపై కేసు నమోదు చేశారు.

ఘనంగా ఆదిత్యుని కల్యాణం

అరసవల్లి: ప్రత్యక్ష దైవం అరసవల్లి సూర్యనారాయణ స్వామి కల్యాణోత్సవం ఫాల్గుణ బహుళ ఏకాదశి సందర్భంగా శుక్రవారం ఉదయం ఘనంగా జరిగింది. శ్రీ ఉషా పద్మిని ఛాయా దేవేరులతో శ్రీవారి ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి కల్యాణ మూర్తులుగా అనివేటి మండపంలో వేంచేసింపజేశారు. అనంతరం ఆగమశాస్త్ర ప్రకారం ఆలయ ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ ఆధ్వర్యంలో అర్చకులు ఇప్పిలి సాందీప్ శర్మ కల్యాణాన్ని నిర్వహించారు.

సారా స్థావరాలు ధ్వంసం



ఒడిశా దుర్గం గ్రామంలో సారా తయారీ స్థావరాలపై దాడులు నిర్వహిస్తున్న ఏఓబీ పోలీసుల బృందం

మెళియాపుట్టి: మండల సరిహద్దుల్లోని గొప్పిలి, భరణికోట పంచాయతీలకు ఆనుకుని ఉన్న పలు గ్రామాల్లో ఆంధ్రా ఒడిశా డీటీఎఫ్, ఎస్ఈబీ, ఇంటెలిజెన్స్ బృందాలు శుక్రవారం సమన్వయంతో సారా తయారీ స్థావరాలపై దాడులు చేశాయి. ఈ దాడుల్లో 13,000 లీటర్ల పులిసిన బెల్లపు ఊటలను ధ్వంసం చేశారు. 200 లీటర్ల నాటుసారాని స్వాధీనం చేసుకున్నారు. శ్రీకాకుళం ఎస్ఈబీ జేడీ గంగాధరం సూచనల మేరకు దాడులు నిర్వహించినట్లు తెలిపారు. ఆంధ్రా ఒడిశా సిబ్బంది కలిసి ముందస్తు సమావేశం నిర్వహించి శుక్రవారం వేకువ జామున ఒడిశా సరిహద్దు గ్రామాలకు చేరుకుని ఆకస్మికంగా దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో ఒడిశా గ్రామాలైన పెదబురుజోల, చిన బురుజోల, బీంపురం, దుర్గం గ్రామాల్లో నిర్వహించిన దాడుల్లో 13000లీటర్ల బెల్లపు ఊటలను ధ్వంసం చేయగా.. 200 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకున్నారు. దాడుల అనంతరం ఆయా గ్రామాల ప్రజలకు నాటుసారా తయారీ వలన కలిగే నష్టాలను తెలియపరచి, సారా తయారీ, క్రయ విక్రయాలు మానుకోవాలని సూచించారు. దాడుల్లో ఈఎస్ తిరుపతినాయుడు, సీఐలు రామచంద్ర కుమార్, రాజశేఖర్ నాయుడు, ఎ.బే గమ్‌లతో పాటుగా ఒడిశా పోలీసులు, శ్రీకాకుళం జిల్లా ఎస్ఈబీ సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీముఖలింగేశ్వరుని తిరువీధి

జలుమూరు: ప్రసిద్ధ శైవక్షేత్రం శ్రీముఖలింగంలో వెలసిన మధుకేశ్వరుని తిరువీధి శుక్రవారం ఘనంగా జరిగింది. ఫాల్గుణ మాసం ఏకాదశి సందర్భంగా గణపతి పూజతో ప్రారంభించి స్వామికి ఏకవార అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. పార్వతీ పరమేశ్వరుల ఉత్సవ మూర్తులను చక్కగా అలంకరించి పల్లకిలో ఉంచి ఊరేగించారు.

• భక్తిశ్రద్ధలతో దొండనచో దీక్షలు

గంజాం జిల్లాలో ప్రసిద్ధ చైత్రమాస దొండనచో దీక్షలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. నగరంలోని పలు వీధుల్లో దొండనచో దీక్షాదారుల ప్రదర్శనలు శుక్రవారం జరిగాయి. సంప్రదాయం ప్రకారం మిట్ట మధ్యాహ్నం ఎండలో కఠోర ప్రదర్శనలు చేపట్టారు. ఉపవాసాలతో ఉన్న దీక్షాధారులు సాయంత్రం స్నానం చేసిన అనంతరం ప్రసాద చేవనం చేస్తున్నారు. రాత్రి దొండకాళి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసిన అనంతరం, వివిధ రకాల సాంస్కృతిక నాటికల ప్రదర్శనలతో స్థానికులను అకట్టుకుంటున్నారు. – బరంపురం







భానుడు భగభగ

- రాష్ట్రంలో ఉక్కపోత వాతావరణం
- భువనేశ్వర్‌లో అత్యధిక ఉష్ణోగ్రత
- చలివేంద్రాలు ఏర్పాటుకు ప్రభుత్వం ఆదేశాలు



వీడియో కాన్ఫరెన్సులో పాల్గొన్న రాష్ట్ర విపత్తు నిర్వహణ అధికారులు


భువనేశ్వర్: రాష్ట్రంలో వాతావరణం నిప్పుల కుంపటిని తలపిస్తోంది. ఉదయం పూట సైతం గడప దాటడం భయానకంగా పరిణమించే పరిస్థితులు ఆవహించాయి. ఈ పరిస్థితుల్లో వడదెబ్బ ప్రమాదాలు నివారించాలని రాష్ట్ర ప్రత్యేక సహాయ కమిషనర్ (ఎస్ఆర్‌ఈ) కార్యాలయం శుక్రవారం ఆదేశాలు జారీ చేసింది. రాష్ట్రంలో 5 ప్రధాన నగరపాలక సంస్థలకు చలివేంద్రాలు తక్షణమే ఏర్పాటు చేయాలని ఎస్ఆర్‌సీ సత్యబ్రత సాహు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ జాబితాలో భువనేశ్వర్, కటక్, సంబలపూర్, బరంపురం, రౌర్కెలా నగర పాలక సంస్థలు ఉన్నాయి. జాతీయ విపత్తు నిర్వహణ అధికార వర్గం (ఎన్‌డీఎంఏ) దేశంలో 10 వేడి ప్రభావిత రాష్ట్రాల్లో వడగాడ్పుల తీవ్రతపై సన్నద్ధత చర్యలను సమీక్షించింది. రాష్ట్రం నుంచి అదనపు ప్రత్యేక సహాయ కమిషనర్‌తో పాటు ఒడిశా విపత్తు నిర్వహణ అధికార సంస్థ (ఓస్డమా) ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, ఇతర అధికారులు వీడియో కాన్ఫరెన్సు ద్వారా ఈ సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న ఎండ తీవ్రత, వడదెబ్బ నివారణ చర్యలకు సంబంధించి సమగ్ర సమాచారం ప్రదర్శించారు.

ప్రతి వార్డులో చలివేంద్రాలు

ఎస్ఆర్‌సీ మార్గదర్శకాల మేరకు వేడి సమయంలో పౌరులకు ఉపశమనం కలిగించడానికి స్థానిక నగర పాలక సంస్థ బీఎంసీ నగరమంతటా తాత్కాలిక చలివేంద్రాలను తెరిచింది. నగరంలోని ప్రతి వార్డులో ఇటువంటి 2 చలివేంద్రాలు ఏర్పాటు చేస్తారని బీఎంసీ తెలిపింది. ప్రజారోగ్య పరిరక్షణ దృష్ట్యా నాణ్యమైన నీటిని అందజేయడం జరుగుతుందని తెలిపారు.

వడదెబ్బపై అప్రమత్తత

రాష్ట్రవ్యాప్తంగా వడదెబ్బ విపత్తు నిర్వహణకు అన్ని ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని ఎస్ఆర్‌సీ ఆదేశాల్లో పేర్కొంది. పగటిపూట గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని ఆశ్రయాలు, కమ్యూనిటీ, ఇతర ప్రభుత్వ భవనాల వద్ద నిరాశ్రయులైన నిరుపేదలకు వసతి కల్పించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ప్రధాన ఆస్పత్రులు, డిస్పెన్సరీలు, పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలు, సబ్-డివిజన్, జిల్లాలో ప్రాణ రక్షణ మందులు, సెలైన్, ఓఆర్ఎస్‌లను తగినంత నిల్వ ఉంచడం అనివార్యంగా పేర్కొంది. భారత వాతావరణ శాఖ ఏప్రిల్ 6 వరకు కటక్, ఖుర్దా, నయాగడ్, బౌద్ధ్, కెంజొహర్, మల్కన్‌గిరి, నయాగడ్, అంగుల్, బొలంగీర్, సుందర్‌గడ్, సంబల్‌పూర్, ఢెంకనాల్, కందమాల్, బాలాసోర్, భద్రక్, జాజ్‌పూర్, మయూర్‌భంజ్, ఝూర్సుగుడలో వడగాడ్పుల హెచ్చరికలను జారీ చేసింది. ఒకటి, రెండు రోజులు రాత్రి పూట వేడిగా ఉండే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం సమాచారం. తదుపరి వాతావరణంలో మార్పు చోటు చేసుకుని రాష్ట్రంలో ఉరుములు, మెరుపులు, వడగళ్లతో భారీ వర్షాలతో పగటి ఉష్ణోగ్రత కొద్దిగా తగ్గుతుంది.



రాజధానిలో అత్యధిక వేడి

భువనేశ్వర్ నగరంలో శుక్రవారం ఎండ తీవ్రత భగ్గుమంది. పలు ప్రాంతాల్లో పగటి పూట గరిష్ఠ ఉష్ణోగ్రత 40 డిగ్రీల సెల్సియస్ పైబడి నమోదైంది. రాష్ట్రస్థాయిలో రాజధాని నగరంలో అత్యధిక వేడి రికార్డు అయింది. 40 డిగ్రీల సెల్సియస్ పైబడిన ప్రాంతాల్లో ఉష్ణోగ్రత వివరాలు పరిశీలిస్తే...

ప్రాంతం	గరిష్ఠ ఉష్ణోగ్రత (డిగ్రీల సెల్సియస్)		
భువనేశ్వర్	43.5	భద్రక్	41.2
పర్లాకిమిడి	42.6	భవానీపట్న	41.2
తాల్చేరు	42.4	చాంద్‌బాలి	41.2
మల్కన్‌గిరి	42.2	బరిపద	41.0
బౌధ్	42.2	కేంద్రాపడా	41.0
పూరీ	42.1	సుందరగడ్	41.0
బొలంగీరు	42.0	హీరాకుద్	41.0
ఝూర్సుగుడ	42.0	కెంజొహర్	40.5
నయాగడ్	42.0	కటక్	40.6
టిట్లాగడ్	42.0	ఢెంకనాల్	40.6
జగత్‌సింగ్‌పూర్	41.5	బర్‌గడ్	40.4
సంబలపూర్	41.3	జాజ్‌పూర్	40.0
		రౌర్కెలా	40.0



భువనేశ్వర్‌లో చలివేంద్రం

ప్రజలు మార్పు కోరుకుంటున్నారు

- బీజేపీ బరంపురం లోక్‌సభ అభ్యర్థి ప్రదీప్



ప్రసంగిస్తున్న ఎంపీ అభ్యర్థి ప్రదీప్ పాణిగ్రాహి

బరంపురం: గత 23 ఏళ్లలో రాష్ట్రంలో అవినీతి పెచ్చుమీరిందని, దీంతో ప్రజలు మార్పు కోరుకుంటున్నారని బీజేపీ బరంపురం లోక్‌సభ అభ్యర్థి డా. ప్రదీప్ పాణిగ్రాహి అన్నారు. స్థానిక గుసానినువాగంలోని జనతా మైదానంలో ఆ పార్టీ ఎన్నికల సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలో, రాష్ట్రంలో బీజేపీ అనుకూల పవనాలు వీస్తున్నాయని పేర్కొన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్రంలో అధికారంలోకి వస్తామని దీమా వ్యక్తం చేశారు. సీఎం నవీన్ పట్నాయక్ ప్రాతినిధ్యం వహిస్తున్న గంజాం జిల్లాలో అవినీతి పెరిగిపోయిందన్నారు. సమావేశంలో కార్యదర్శి మధన్ మోహన్ పాత్రో, సునీల్ సాహు, కైలాస్ సడంగి తదితరులు పాల్గొన్నారు.

మెహందీ పోటీలకు అనూహ్య స్పందన



పోటీలను ప్రారంభిస్తున్న రాఘవ కుముంధాన్

రాయగడ: స్థానిక తేజస్వీ హోటల్ మైదానంలో జిల్లా ఉగాది ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం నిర్వహించిన మెహందీ పోటీలకు అనూహ్య స్పందన లభించింది. మహిళలు ఉత్సాహంగా పోటీల్లో పాల్గొన్నారు. కమిటీ ముఖ్య సలహాదారుడు రాఘవ కుముంధాన్ ముఖ్య అతిథిగా హాజరై పోటీలను ప్రారంభించారు. ప్రతీ ఏడాది మహిళలను ఉత్సాహపరిచేందుకు పోటీలను నిర్వహిస్తున్నట్లు ఆయన తెలియజేశారు. గత 11 ఏళ్లుగా ఉత్సవాలను కమిటీ అధ్యక్షుడు నెక్కంటి భాస్కరరావు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. పోటీల్లో 105 మంది పాల్గొనగా ప్రథమ బహుమతి ఎస్‌కే చాందిని, ద్వితీయ బహుమతి ఎస్‌కే సంపు, తృతీయ బహుమతి ఎం.మౌనికలు గెలుచుకున్నారు. అదేవిధంగా సంజుక్త పాణిగ్రాహి, ప్రియాంక మహారణలు ప్రోత్సాహక బహుమతులు గెలుచుకున్నారు.

భారీగా గంజాయి స్వాధీనం



అరెస్టైన నిందితులను చూపిస్తున్న ఎక్సైజ్ అధికారులు

బరంపురం: నగరానికి అక్రమంగా తరలిస్తున్న 220 కిలోల గంజాయిని ఎక్సైజ్ అధికారులు స్వాధీనం చేసుకొని, ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేశారు. ఐఐసీ అధికారి గీతాంజలి సాహు తెలిపిన వివరాల మేరకు.. శుక్రవారం ఉదయం కొందమాల్ జిల్లా దరింగబడి నుంచి బరంపురం నగరానికి ట్రాక్టర్‌లో అక్రమంగా గంజాయిని తరలిస్తున్నట్లు పోలీసులకు సమాచారం వచ్చింది. దీంతో ఎక్సైజ్ పోలీసులు తప్తపాణి ఘాటీ జంక్షన్ మార్గమధ్యలో వాహన తనికీలు చేపట్టారు. ఈ క్రమంలో అనుమానంతో ఒక ట్రాక్టర్‌లో సోదాలు చేపట్టగా 220 కిలోల గంజాయి పట్టుబడింది. దీంతో టాక్టర్‌ను సీజ్‌చేసి, ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేశారు. అరెస్టైనవారు పశ్చిమ బెంగాల్ రాష్ట్రానికి చెందిన మున్నాఖాన్, మనోజ్ బెనర్జిలుగా గుర్తించారు. స్వాధీనం చేసుకున్న గంజాయి సుమారు రూ.13 లక్షల విలువ చేస్తుందని వెల్లడించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నారు.

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శనలు



నృత్యాలు చేస్తున్న కళాకారులు

రాయగడ: ఉగాది ఉత్సవాల్లో భాగంగా స్థానిక తేజస్వీ హోటల్ సమావేశ మందిరంలో శుక్రవారం నిర్వహించిన నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. యువతీ, యువకులు, చిన్నారులు తమ నృత్య ప్రదర్శనలతో ప్రేక్షకులను అలరించారు. ప్రతీ కళాకారుడికి ఐదు నిమిషాల సమయం కేటాయించారు. జానపద, ఆధునిక పాటలకు అనుగుణంగా కళాకారులు నృత్య ప్రదర్శనలు చేశారు. అదేవిధంగా సంబల్‌పూర్ తరహా ఒడియా పాటలకు కూడా కళాకారులు నృత్య ప్రదర్శనలు చేశారు.



బీజేడీ జిల్లా అధ్యక్షుడిగా నెక్కంటి



నెక్కంటికి అభినందనలు తెలుపుతున్న కార్యకర్తలు, నాయకులు

రాయగడ: జిల్లా బీజేడీ అధ్యక్షుడిగా నెక్కంటి భాస్కరరావు నియమితులయ్యారు. ఈ మేరకు ఆ పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి ప్రణవ్ ప్రకాష్ దాస్ (బొబి) శుక్రవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. అదేవిధంగా రాయగడ శాసనసభ నియోజకవర్గం ఎన్నికల ఇన్‌చార్జిగా కాసీపూర్‌కు చెందిన ప్రముఖ నాయకుడు కృష్ణ మహాపాత్రోను నియమిస్తున్నట్లు పేర్కొన్నారు. దీంతో రాయగడ బీజేడీలో అనూహ్య మార్పులు చోటు చేసుకుంటున్నాయి. జిల్లా అధ్యక్షుడిగా విధులు నిర్వహించే సుధీర్ దాస్ అధిష్టానం ఆదేశాల మేరకు రాజీనామా చేశారు. అత్యంత ప్రతిష్టాత్మకంగా మారిన రాయగడ శాసనసభ నియోజకవర్గం స్థానంలో అనసూయా మాఝికి పార్టీ టిక్కెట్టు ఖరారవ్వడంతో ప్రారంభమైన సంతృప్తికి నేటితో తెరపడింది. నెక్కంటి ఆధ్వర్యంలో జిల్లాలోని రాయగడ, గుణుపూర్, బిసంకటక్ శాసనసభ నియోజకవర్గాలతో పాటు కొరాపుట్ లోక్‌సభ స్థానంను కూడా నెక్కంటి గెలిపించాల్సిన బాధ్యతను అధిష్టానం అప్పగించడంతో ఆయన వర్గీయులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు ఆయనకు పలువురు అభినందనలు తెలిపారు.

జాతీయ స్థాయి ఎన్‌సీసీ క్యాంపునకు కల్పన ఎంపిక



కల్పన హుబ్లీకర్

శ్రీకాకుళం న్యూకాలనీ: శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలకు చెందిన నేషనల్ క్యాడెట్ కార్ప్స్ (ఎన్‌సీసీ) విద్యా ర్థిని కల్పన హుబ్లీకర్ చరిత్ర సృష్టించింది. 14వ ఆంధ్ర బెటాలియన్ ఎన్‌సీసీ శ్రీకాకుళం కేంద్రం నుంచి జాతీయ స్థాయిలో జరిగే ట్రెక్కింగ్ క్యాంపునకు కళాశాల తరపున ఎంపికైన మొదటి ఎన్‌సీసీ క్యాడెట్‌గా కల్పన హుబ్లీకర్ రికార్డులకు ఎక్కింది. ఈమె కళాశాలలో డిగ్రీ బీఎస్సీ (ఎంపీసీఎస్) ద్వితీయ సంవత్సరం చదువుతోంది. మే నెల మొదటి వారంలో తమిళనాడులోని ఉదక మండలంలో జరిగే ఈ క్యాంపునకు కళాశాల నుంచి ఎన్‌సీసీ క్యాడెట్ కల్పన ఎంపిక కావడం కళాశాలకు గర్వకారణమని ప్రిన్సిపల్ డాక్టర్ పి.సురేఖ సంతోషం వ్యక్తంచేశారు. మిగతా మహిళలు, పురుషుల ఎన్‌సీసీ క్యాడెట్లకు కల్పన ప్రేరణగా నిలుస్తుందని ఆమె చెప్పారు. ఇందుకు సహకరించిన కళాశాల ఎన్‌సీసీ అధికారి కెప్టెన్ డాక్టర్ వై.పోలినాయుడును, మహిళా కేర్ టేకర్లు వరలక్ష్మి, పావనిలను ఆమె అభినందించారు. జాతీయ ట్రెక్కింగ్ క్యాంప్‌నకు కల్పన ఎంపికపై కళాశాల అధ్యాపకులు సిబ్బంది అభినందించారు.

సాఫ్ట్‌బాల్ క్రీడాకారుడికి అభినందన



పవన్‌కుమార్‌ను అభినందిస్తున్న డీఈఓ వెంకటేశ్వరరావు, అధికారులు, పీడీలు

శ్రీకాకుళం న్యూకాలనీ: రాష్ట్ర, జాతీయస్థాయిలో కనబర్చిన పోరాట స్ఫూర్తితో క్రీడాకారులు అంతర్జాతీయ స్థాయికి చేరుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారి కె.వెంకటేశ్వరరావు అన్నారు. మహారాష్ట్రలోని ఔరంగబాద్ వేదికగా మార్చి 29 నుంచి ఏప్రిల్ 3వ తేదీ వరకు ఆలిండియా సబ్–జూనియర్స్ బాలబాలికల సాఫ్ట్‌బాల్ చాంపియన్‌షిప్–2024 పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో సమష్టిగా రాణించి అత్యద్భుతంగా ఆడిన ఆంధ్రప్రదేశ్ జట్టు విజేతగా నిలిచి ట్రోఫీని అందుకుంది. ఆంధ్రప్రదేశ్ జట్టుకు ప్రాతినిధ్యం వహించిన శ్రీకాకుళం జిల్లా క్రీడాకారుడు యతిరాజుల పవన్‌కుమార్ జట్టు విజయంలో కీలక భూమిక పోషించాడు. ఎచ్చెర్ల మండలం కేశవరావుపేటకు చెందిన ఈ యువ క్రీడాకారుడు పవన్‌కుమార్ జట్టు విజేతగా నిలవడంతో బంగారు పతకంతోపాటు నగదు బహుమతి, ప్రశంసా పత్రాన్ని అందుకున్నాడు.

అభినందించిన డీఈఓ

టోర్నీ ముగించుకుని జిల్లాకు చేరుకున్న పవన్‌ను డీఈఓ కె.వెంకటేశ్వరరావు, శ్రీకాకుళం డీవైఈఓ ఆర్.విజయకుమారి, ఏసీ లియాఖత్ ఆలీఖాన్ శుక్రవారం స్థానిక ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల టెస్ట్ మూల్యాంకన కేంద్రంలో అభినందించారు. క్రీడాకారుడితోపాటు తీర్చిదిద్దుతున్న సంఘ బాధ్యులను, కోచ్‌లను మెచ్చుకున్నారు.

జిల్లా పీటీ, పీఈటీ సంఘ అధ్యక్షకార్యదర్శులు ఎంవీ రమణ, ఎం.సాంబమూర్తి, ఉపాధ్యక్షులు మెట్ట తిరుపతిరావు, బ్యాడ్మింటన్ సంఘ జిల్లా సీఈఓ సంపతిరావు సూరిబాబు, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు. సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షులు కలిదిండి నరసంహరాజు, కార్యదర్శి సిగిలిపల్లి లక్ష్మీదేవి, కన్వీనర్ కలిదిండి వెంకటరామరాజు, చైర్మన్ బడగల హరిధరరావు, తదితరులు సంతోషం వ్యక్తంచేశారు.

ఉమాకవికి ఉగాది పురస్కారం

శ్రీకాకుళం కల్చరల్: నెల్లూరు జిల్లా వెంకటాచలంలో నిర్వహించిన క్రోధి నామ ఉగాది కవి సమ్మేళనంలో శ్రీకాకుళానికి చెందిన సాహితీ చైతన్యకిరణాలు, బాల కథానిలయం అధ్యక్షుడు బి.ఉమామహేశ్వరరావుకు ఉగాది పురస్కారం వరించింది. నెల్లూరు భారతి భాషా సంస్థ, మైసూరు విద్యాలయం ప్రధాన కేంద్రం సంయుక్త నిర్వహణలో శుక్రవారం జరిగిన కవి సమ్మేళనంలో ఉగాది ఉషస్సు అనే కవిత చదివినందుకుగాను సంస్థ అధ్యక్షుడు ప్రొఫెసర్ ఆచార్య ఎం.సంపత్‌కుమార్ అందజేశారు.

స్వాభిమాన్ ఏరియాలో సీఎస్ పర్యటన



స్వాభిమాన్ ఏరియాలో పర్యటిస్తున్న సీఎస్ ప్రదీప్ కుమార్ తదితరులు

మల్కన్‌గిరి: జిల్లాలోని చిత్రకొండ సమితి స్వాభిమాన్ ఏరియాలో ఒడిశా ప్రభుత్వ సీఎస్ ప్రదీప్‌కుమార్ జెనా శుక్రవారం పర్యటించారు. దీనిలో భాగంగా చిత్రకొండ మిషన్ శక్తి కేఫ్‌లో భోజనం చేసి, అనంతరం అక్కడ జరుగుతున్న పలు అభివృద్ధి పనులను సమీక్షించారు. హంతాల్‌గూడ పంచాయతీలో ఉన్న బీఎస్ఎఫ్ క్యాంప్‌కు చేరుకొని అక్కడ జవాన్లతో పలు అంశాలపై చర్చించారు. అక్కడి నుంచి ఊదల్‌పాడ్ గ్రామంలో ఉన్న పాఠశాలకు వెళ్లి పరిస్థితులను తెలుసుకున్నారు. అలాగే వసుధ యోజన పథకంలో భాగంగా ఏర్పాటు చేస్తున్న తాగునీటి ప్రాజెక్టును సందర్శించారు. అనంతరం గురుప్రియ వంతెన పరిసర ప్రాంతాల్లో పర్యటించారు. ఆయనతో పాటు కలెక్టర్ సచిన్ పవార్, ఎస్పీ నితీష్ వాద్వానీ, 177 బెటాలియాన్ బీఎస్ఎఫ్ ఐజీటీ కె.చత్రీ, చిత్రకొండ బీడీవో తన్మయి పాన్, ఏపీడీ (ఫైనాన్స్) మానస్ మిశ్రో, చిత్రకొండ తహసీల్దార్ నట్‌బర్ గార్దా తదితరులు ఉన్నారు.

క్లుప్తంగా

జరజాపుపేటలో ఉద్రిక్తత


జరజాపుపేటలో మిమ్స్ హెచ్ఆర్ శ్రీనివాసరావు ఇంటిని ముట్టడించిన ఉద్యోగులు

నెల్లిమర్ల రూరల్: నగర పంచాయతీ పరిధిలోని జరజాపుపేటలో శుక్రవారం ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. సమస్యలు పరిష్కరించాలని, పాత ఒప్పంద పత్రాలను తమకివ్వాలని డిమాండ్ చేస్తూ మిమ్స్ ఉద్యోగులు హెచ్ఆర్ విభాగంలో పనిచేస్తున్న జీఎం అరిపాక శ్రీనివాసరావు ఇంటిని ముట్టడించారు. అలాగే యాజమాన్యం పక్షాన ఉన్న మరో ఇద్దరు ఉద్యోగుల ఇంటి ఎదుట నిరసన చేశారు. ఈ సమాచారం తెలుసుకున్న సీఐ వెంకటేశ్వరరావు, ఎస్సైలు రామగణేష్, హరిబాబు ‌నాయుడు, సన్యాసినాయుడు, తదితరులు జరజాపు పేట చేరుకుని పరిస్థితిని చక్కదిద్దారు. కాగా తమ సిబ్బందిపై భౌతికంగా దాడి చేసిన వారిపై పోలీసులకు ఫిర్యాదు చేశామని మిమ్స్ యాజమాన్యం ప్రతినిధులు తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ నేత సురేష్, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

100 మద్యం సీసాలతో వ్యక్తి అరెస్ట్

సంతకవిటి: మండల పరిధి రామారాయపురం జంక్షన్‌లో అక్రమంగా మద్యం తరలిస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు హెడ్‌కానిస్టేబల్ శీమల దుర్గాప్రసాద్ తెలిపారు. జంక్షన్‌లో శుక్రవారం వాహన తనిఖీలు చేస్తుండగా జీఎస్‌పురం గ్రామానికి చెందిన వ్యక్తి 100 మద్యంసీసాలు తరలిస్తూ పట్టుబడడంతోబాటిల్స్ స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

15 మద్యం సీసాలతో మరో వ్యక్తి..

బొబ్బిలి: ఎస్ఈబీ సర్కిల్ పరిధిలోని బాడంగి మండలం రేజేరుకు చెందిన గొట్టాపు సత్యనారాయణ 15 మద్యం సీసాలను కలిగి ఉండగా అరెస్టు చేసినట్లు సీఐ బీవీ మురళీధర్ ఒక ప్రకటనలో తెలిపారు. నిందితుడి దగ్గర మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

50 మద్యం సీసాల పట్టివేత

రేగిడి: మండల పరిధి రెడ్డిపేట జంక్షన్ వద్ద అక్రమంగా తరలిస్తున్న 50 మద్యం బాటిల్స్‌ను పట్టుకున్నామని ఎస్ఈబీ సీఐ బి.శ్రీధర్ శుక్రవారం తెలిపారు. రెడ్డిపేట గ్రామానికి చెందిన రేగిడి రాము అక్రమంగా మద్యం తరలిస్తున్నాడని అందిన సమాచారం మేరకు జంక్షన్ వద్ద కాపుకాసి పట్టుకున్నామని చెప్పారు. మద్యం బాటిల్స్ స్వాధీనం చేసుకుని కేసు నమోదుచేశామని తెలిపారు.

కృష్ణపల్లి సమీపంలో గుర్తు తెలియని మృతదేహం


గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

పార్వతీపురం టౌన్: మండలంలోని కృష్ణపల్లి గ్రామ సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. శుక్రవారం జరిగిన ఈ సంఘటన వివరాలిలా ఉన్నాయి. కృష్ణ పల్లి పంచాయతీ ధనుంజయపురం రెవెన్యూ పరిధిలో పాలకొండ దాసు మామిడి తోటలో చెట్టు కింద గుర్తుతెలియని వ్యక్తి మృతి చెంది ఉన్నట్లు వీఆర్ఓ చేసిన ఫిర్యాదు మేరకు రూరల్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతుని వయసు సుమారు 30-35 ఏళ్ల మధ్య ఉంటాయి. గ్రీన్ కలర్ ట్రాక్ ఫ్యాంట్, నీలం రంగు ఫుల్ హాండ్స్ షర్ట్ ధరించి ఉన్నాడు. మాసిన గడ్డం, చామనఛాయ రంగు, సుమారు 5.5 అడుగుల ఎత్తు ఉంటాడని పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని పార్వతీపురం జిల్లా ఆస్పత్రి మార్చురీలో భద్రపరిచామని ఆచూకీ తెలిసిన వారు పార్వతీపురం రూరల్ పోలీసులను సంప్రదించాలని కోరారు. ఈ ఘటనపై రూరల్ పోలీసు ఎస్సై దినకర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైలు పట్టాలపై గుర్తు తెలియని వ్యక్తి మృతి


గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

విజయనగరం క్రైమ్: కోరుకొండ, అలమండ రైల్వేస్టేషన్‌ల మధ్య సుమారు 30 నుంచి 40 ఏళ్ల మధ్య వయసు కలిగిన గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు జీఆర్‌పీ ఎస్సై రవివర్మ శుక్రవారం తెలిపారు. మృతుడి శరీరంపై బ్లూ కలర్ హాఫ్ హ్యాండ్స్ టీ షర్ట్, రెడ్ కలర్ ట్రాక్ ఫ్యాంట్ ఉన్నాయని చెప్పారు. ఆచూకీ తెలిసిన వారు విజయనగరం జీఆర్‌పీ సిబ్బందిని సంప్రదించాలని కోరారు. మృతదేహాన్ని కేంద్రాస్పత్రికి తరలించి కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి..

విజయనగరం క్రైమ్: రోడ్డు ప్రమాదంలో గాయపడిన కేఎల్.పురం వాసి వాడాడ శ్రావణ కుమార్ (33) చికిత్స పొందుతూ మృతిచెందాడు. దీనికి సంబంధించి వన్‌టౌన్ పోలీసులు అందించిన వివరాలిలా ఉన్నాయి. మార్చి 30న తన బావతో కలిసి శ్రావణ్ కారులో ప్రయాణం చేస్తుండగా కారు అదుపుతప్పి సిక్కుల దేవాలయం వద్ద గోడను బలంగా ఢీకొంది. దీంతో జరిగిన ప్రమాదంలో తీవ్ర గాయాలపాలైన శ్రావణ్‌ను చికిత్స నిమిత్తం కేంద్రాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందాడు. మృతుడి సోదరి స్వాతి ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ ఎస్సై నరేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వార్షిక పరీక్షలకు సర్వం సిద్ధం

- నేటి నుంచి ఈ నెల 19వ తేదీ వరకు జరగనున్న పరీక్షలు
- సిద్ధమవుతున్న 1 నుంచి 9వ తరగతి విద్యార్థులు 2.07లక్షల మంది
- 9వ తరగతికి పాతపద్ధతిలో పరీక్ష నిర్వహణ
- మండల కేంద్రాలకు చేరిన ప్రశ్నపత్రాలు, ఓఎంఆర్ షీట్లు
- కట్టుదిట్టంగా పరీక్షల నిర్వహణ: ఎన్.ప్రేమకుమార్, డీఈఓ


తరగతి గదిలో విద్యార్థులు

విజయనగరం అర్బన్: జిల్లా వ్యాప్తంగా వార్షిక పరీక్షల నిర్వహణకు విద్యాశాఖ అధికారులు సర్వం సిద్ధం చేశారు. ఒకటో తరగతి నుంచి 9వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు శనివారం నుంచి ఈ నెల 19వ తేదీ వరకు షెడ్యూల్ ప్రకారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు జరగనున్నవి. పశ్న పత్రాలను డీసీఈబీ నుంచి మండల కేంద్రాలోని ఎమ్మార్సీలకు తరలించి భద్రపరిచారు. సంబంధిత పరీక్షలకు జిల్లా వ్యాప్తంగా 2,07,026 మంది విద్యార్థులు హాజరు కానున్నారు.

బైలింగ్విస్ విధానంలో ప్రశ్నపత్రం

సీబీఏ విధానంలో విద్యార్థులకు ఇచ్చే ప్రశ్నపత్రం బైలింగ్విస్ (ద్విభాష) విధానంలో ఉంటుంది. ఇప్పటి వరకు ఇంగ్లిష్ మీడియం వారికి ఆంగ్లంలో, తెలుగు మీడియం వారికి తెలుగులో ప్రశ్నపత్రం ఇస్తున్నారు. ఇప్పటికే పాఠ్యపుస్తకాలను బైలింగ్విస్ పద్ధతిలో ముద్రించిన విద్యాశాఖ ప్రశ్నపత్రాన్ని కూడా బైలింగ్విస్‌లో రూపొందించింది.

టైమ్ టేబుల్ విడుదల

పరీక్షల నిర్వహణకు ఎస్‌సీఆర్‌టీ టైమ్ టేబుల్ విడుదల చేసింది. పరీక్షల నిర్వహణ అనంతరం ఏప్రిల్ 21వ తేదీలోగా జవాబు పత్రాలను మూల్యాంకనం చేసి ఫలితాలను ఆన్‌లైన్‌లో పొందుపరచాలని పాఠశాల విద్యాశాఖ సూచించింది. ఏప్రిల్ 23న ప్రోగ్రెస్ కార్డులను విద్యార్థులకు అందజేయడంతో పాటు తరగతి వారీగా ప్రమోషన్ జాబితాలు సిద్ధం చేయాలి.

ఒకటి నుంచి ఐదు తరగతులకు...:

1 నుంచి 5వ తరగతుల విద్యార్థులకు 6న తెలుగు, 8న ఇంగ్లిష్, 10న ఇంగ్లిష్ పార్ట్-బీ (టోఫెల్), 12న గణితం, 13న పరిసరాల విజ్ఞానం పరీక్షలు నిర్వహిస్తారు. ప్రాథమిక పాఠశాలల్లో ప్రధానమైన పరీక్షలు 13తో ముగుస్తాయి. 15న ఓఎస్ఎస్‌సీ, 16న 4వ తరగతి విద్యార్థులకు మాత్రం స్టేట్ లెవల్ ఎచీవ్‌మెంట్ సర్వే (స్లాష్) పరీక్షను నిర్వహించనున్నారు.

ఆరు నుంచి తొమ్మిది తరగతులకు..:

6 నుంచి 9వ తరగతుల విద్యార్థులకు 6న తెలుగు, 8న హిందీ, 10న ఇంగ్లిష్ పార్ట్-ఏ, 12న ఇంగ్లిష్ పార్ట్-బి (ట్రోఫెల్), 13న గణితం, 15న ఒకటి నుంచి 8వ తరగతి వరకు జనరల్ సైన్స్, 9వ తరగతికి ఫిజికల్ సైన్స్, 16న బయలాజికల్ సైన్స్, 18న సోషల్ స్టడీస్, 19న 8, 9 తరగతులకు కాంపోజిట్ కోర్సులు/ఓఎస్ఎస్‌సీ 1 అండ్ 2 పరీక్షలు, అదే రోజున 6, 7 తరగతులకు పేపర్-1, పేపర్-2 పరీక్షలు ఉంటాయి.

ఎంఈఓల విధులు ఇలా..

ప్రశ్నపత్రాలను, ఓఎంఆర్ షీట్‌లను పాఠశాల వారి విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా అందజేయాలి. పరీక్ష ప్రారంభం రోజున స్ట్రాంగ్ రూంలోని ప్రశ్నపత్రాలను ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులకు అందించాల్సి ఉంటుంది.
- 6 నుంచి 9వ తరగతి వరకు ప్రశ్నపత్రాలను అన్ని పాఠశాలలకు ఎమ్మార్సీల నుంచి మాత్రమే ప్రతిరోజు టైమ్ టేబుల్ అనుసరించి పరీక్షకు గంట ముందు ఇవ్వాలి.
- పరీక్షల అనంతరం అన్ని పాఠశాలల నుంచి ఓఎంఆర్ షీట్స్ సేకరించి కన్సాలిడేషన్ లిస్టును తయారు చేసి స్కానింగ్ నిమిత్తం 20వ తేదీన డీసీఈబీ కార్యాలయానికి పంపాలి.

కట్టుదిట్టంగా పరీక్షల నిర్వహణ



పదో తరగతి పబ్లిక్ పరీక్షల మాదిరిగానే వార్షిక పరీక్షలను కట్టుదిట్టంగా నిర్వహించాలని హెచ్ఎంలను ఆదేశించారు. అవకతవకలు, లోపాలు చోటు చేసుకున్న చోట సంబంధిత హెచ్ఎంలు, ఉపాధ్యాయులపై చర్యలు తప్పవు.
– ఎన్.ప్రేమకుమార్, డీఈఓ

కొనసాగుతున్న వైఎస్సార్‌సీపీలో చేరిక పరంపర


వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ నాయకులను ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే జోగారావు


కోడూరులో ఎంపీ బెల్లాన, ఎమ్మెల్యే శంబంగి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన కార్యకర్తలు


పార్టీలో చేరిన వారికి కండువాలు వేసి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే కోలగట్ల వీరభద్రస్వామి


వైఎస్సార్‌సీపీలో చేరిన వారిని ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ, ఎమ్మెల్సీ సురేష్‌బాబు తదితరులు

పార్వతీపురంటౌన్: పార్వతీపురం పురపాలక సంఘంలోని 10వ వార్డుకు చెందిన 50 టీడీపీ కుటుంబాల వారు ఆ పార్టీని వీడి ఎమ్మెల్యే అలజంగి జోగారావు సమక్షంలో శుక్రవారం వైఎస్సార్‌సీపీలో చేరారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారందరికీ ఎమ్మెల్యే జోగారావు కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించి..వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి గెలుపు కోసం కృషి చేయాని కోరారు. తామంతా టీడీపీలో దశాబ్దాలుగా ఉంటున్నప్పటికీ తమకు ఏమాత్రం మేలు జరగలేదని, ఏదైనా మేలు జరిగిందంటే కేవలం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వంలోనేనని పార్టీలో చేరిన వారంతా చెప్పారు. భవిష్యత్తులో తమకు మరింత మేలు జరుగుతుందన్న నమ్మకంతో కుటుంబసభ్యులతో సహా వైఎస్సార్‌సీపీలో చేరామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బాడంగిలో మరో 35 కుటుంబాలు..

బాడంగి: మండలంలోని కోడూరు గ్రామం ఎన్నో ఏళ్లక్రితంనుంచి దివంగత వైఎస్సార్ హయాంలో కాంగ్రెస్‌పార్టీకి, ఇప్పుడు జగన్‌మోహన్ రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీకి కంచుకోటగా నిలుస్తూ వస్తోందని ఇందుకు గతంలో జరిగిన ఎన్నికలే నిదర్శనమని బొబ్బిలి ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు అన్నారు. ఈ మేరకు బాడంగి మండలంలోని కోడూరు గ్రామంలో ఎంపీ బెల్లాన చంద్రశేఖరరావుతో కలిసి శుక్రవారం ఆయన ఎన్నికల ప్రచారానికి వచ్చారు. ఈ సందర్భంగా గురువారం టీడీపీ అభ్యర్థి బేబీనాయన బలవంతంగా తీసుకెళ్లి ఆ పార్టీ కండువాలు వేసిన గ్రామానికి చెందిన వార్డు మెంబర్లు కంటుసింహాచలం, మరిపి సతీష్‌తోపాటు మరిపి కూర్మా రావు తిరిగి వైఎస్సార్‌సీపీలోకి వచ్చేశారని ప్రకటించి వారికి పార్టీ కండువాలు వేశారు. అలాగే రామచంద్రాపురం గ్రామానికి చెందిన వానపల్లి భాస్కరరావు, రాజు, సత్యం, లక్ష్మణ, సింహాచలం, మోహన్‌రావు, రమణ, సత్యనారాయణ, తిరుపతి లక్షుం నాయుడు, త్రినాథ దాసరి, తదితర 35 పద్మశాలి కుటుంబాలవారు వైఎస్సార్‌సీపీలో చేరడంతో పార్టీ కండువాలు కప్పి సాదరంగా స్వాగతించారు. వారంతా మరడ రమణ నాయకత్వంలో పార్టీ తీర్థం పుచ్చుకున్నారని ఎమ్మెల్యే శంబంగి తెలిపారు.

పూసపాటిరేగలో 30 కుటుంబాలు..

పూసపాటిరేగ: మండలంలోని పులిగెడ్డపేట, కొల్లాయివలసల్లో టీడీపీ, జనసేన పార్టీలకు చెందిన 30 కుటుంబాలు నెల్లిమర్ల ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు సంక్షంలో వైఎస్సార్‌సీపీలో శుక్రవారం చేరాయి. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనకు ఆకర్షితులైన పులిగెడ్డపేట, కొల్లాయివలసకు చెందిన అమర పెంటారావు, అమర ఎర్రయ్య, అమర పవన్‌కుమార్, కేశం ఎల్లాజీ, కేశ శూరయ్య, కేశం అప్పన్న, ఆకుళ్ల భూలోక, బుసకల రాజారావు, మహాదాసు అప్పలనారాయణ, మైలపల్లి కొర్లయ్య, మైలపల్లి ఎర్రయ్య, కేశం గురయ్య, కేశం రాము,ఆకుళ్ల కృష్ణయ్యలతో మిగతా కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరాయి. కార్యక్రమంలో ఎమ్మెల్సీ పెనుమత్స సురేష్‌బాబు, వైఎస్సార్‌సీపీ జిల్లాకోశాధికారి కందుల రఘుబాబు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పతివాడ అప్పలనాయుడు, ఎంపీపీ మహంతి కల్యాణి, ప్రజాప్రతినిధులు మహంతి శ్రీనివాసరావు, మహంతి జనార్దనరావు, పైడి సుజాత, తాడిశెట్టి బాబు, పైడి మధు, అమర ఎర్రయ్య తదితరులు పాల్గొన్నారు.

విజయనగరంలో 10 కుటుంబాలు..

విజయనగరం: పట్టణంలోని గాజులరేగ ప్రాంతానికి చెందిన బోనెల కార్తీక్, రాయ్ భాస్కరరావు, నేతల శ్రీను, కుయ్యాన ప్రసాద్, బెల్లాన కళ్యాణ్ కుమార్, దుక్క సునీల్, జలగడుగుల దుర్గతో పాటు సుమారు 10 కుటుంబాల వారు విజయనగరం శాసనసభ అభ్యర్థి కోలగట్ల వీరభద్రస్వామి సమక్షంలో శుక్రవారం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారికి కోలగట్ల పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. నూతనంగా పార్టీలోకి వచ్చిన యువకులను విజయనగరం జిల్లా యాదవ సంఘం అధ్యక్షుడు మన్యాల కృష్ణ, 49వ డివిజన్ ఇన్‌చార్జి కనుగుల రాజా, ముఖ్య నాయకులు పార్టీలోకి సాదరంగా ఆహ్వానించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ట్యాబ్ వినియోగం విద్యార్థులకు తెలియాలి

- ఎంఈఓలతో డీఈఓ సమీక్షా సమావేశం


సమావేశంలో మాట్లాడుతున్న డీఈఓ జి.పగడాలమ్మ

పార్వతీపురం టౌన్: ట్యాబ్ వినియోగం అందరు ఉపాధ్యాయులు, విద్యార్థులకు తెలియాలని పార్వతీపురం మన్యం జిల్లా విద్యాశాఖాధికారిణి జి.పగడాలమ్మ అన్నారు. ఈ మేరకు శుక్రవారం ఆమె స్థానిక డీఈఓ కార్యాలయంలో ఎంఈఓలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి నెల 5వ తేదీ లోపు మండల విద్యాశాఖాధికారులంతా తమ విజిట్ , ఇన్‌స్పెక్షన్, టూర్ ప్రోగ్రాంను డీఈఓ కార్యాలయానికి అందజేయాలని ఆదేశించారు. ప్రతి నెల 5వ తేదీన రివ్యూ నిర్వహిస్తామని ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా హాజరుకావాలని స్పష్టం చేశారు. ప్రతి మండల కార్యాలయంలో ఇన్వార్డ్, ఔట్‌వర్డ్ రిజిస్టర్ వాడాలని సూచించారు. ప్రతి ఉపాధ్యాయుడు ఎస్ఆర్ ప్రొఫైల్ ఎక్‌నాల్జ్‌మెంట్‌తో ఉండాలన్నారు. వర్క్‌బుక్, నోట్‌బుక్ కరెక్షన్ అన్ని పాఠశాలల్లో జరగాలని లేకుంటే చర్యలకు ప్రపోజ్ చేయాలని, అలా చేయని ఎంఈఓల మీద చర్య తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతి మండలంలోని అన్ని పాఠశాలల్లో ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్ నిర్వహించాలని, గత సంవత్సరం కన్నా ఈ సంవత్సరం విద్యార్థుల సంఖ్య పెరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో 15 మండలాల విద్యాశాఖాధికారులు పాల్గొన్నారు.

శివినిలో గడ్డివాములు దగ్ధం


మంటలు అదుపుచేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

కొమరాడ: మండలంలోని శివిని గ్రామంలో శుక్రవారం సంభవించిన అగ్ని ప్రమాదంలో 20 ఎకరాలకు చెందిన గడ్డివాములు దగ్ధమయ్యాయి. రైతుల సమాచారం మేరకు పార్వతీపురం అగ్ని మాపక కేంద్రం అధికారి టి.ఉమమహేశ్వర్, సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపుచేశారు. ఏడాది పొడవునా పశువుల కోసం ఉంచిన గడ్డి దగ్ధం కావడంతో రైతులు అధికారి మోహన్‌రావు, వెంకటినాయుడు, గొరజాన సత్యంనాయుడు తదితరులు లబోదిబోమంటున్నారు.

పాడిరైతుకు ప్రభుత్వం బాసట

- దిగ్విజయంగా పశువిజ్ఞాన బడులు
- జిల్లాకు రూ. కోటి పశుబీమా, వెయ్యి మెట్రిక్ టన్నుల పశుదాణా
- 25 టన్నుల గడ్డి విత్తనాలు అందజేత
- రైతులకు 3,673 కిసాన్ కార్డుల మంజూరు


పార్వతీపురంలోని 18వ వార్డులో పశువులకు టీకాలు వేస్తున్న సిబ్బంది (ఫైల్)


పశువిజ్ఞాన బడులు నిర్వహిస్తున్న సిబ్బంది (ఫైల్)

పార్వతీపురం టౌన్:

అన్నదాతల సంక్షేమం కోసం కృషి చేస్తున్న ప్రభుత్వం పాడి రైతుల అభివృద్ధిపై కూడా దృష్టి సారించింది. రైతు ముంగిటకు సేవలు అందించేందుకు ఆర్బీకేలను ఏర్పాటు చేసి వారికి కావాల్సిన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు అందేలా ఏర్పాటు చేయడమే కాకుండా పాడి రైతుల అభివృద్ధి కోసం రైతు భరోసా కేంద్రాల్లోనే పశువిజ్ఞాన బడి కార్యక్రమాన్ని అమలుచేసింది. దీని ద్వారా పశు పోషణలో మెలకువలపై పశు వైద్య సహాయకులు, గోపాల మిత్రలు రైతులకు పూర్తి అవగాహన కల్పించారు. పార్వతీపురం మన్యం జిల్లాలో గల 306 ఆర్బీకేల్లో 243 మంది పశు వైద్య సహాయకులు, మిగిలిన ఆర్బీకేల్లో ఇన్చార్జిల ద్వారా రైతులకు పశువిజ్ఞాన బడులపై అవగాహన కల్పించారు. ఆర్బీకేలతో పాటు 7 వెటర్నరీ ఆస్పత్రులు, 38 వెటర్నరీ డిస్పెన్సరీలు, 35 గ్రామీణ పశువైద్యశాలలు, 110 మంది గోపాలమిత్రలతో పశువిజ్ఞాన బడి కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేశారు.

జిల్లాలో పాడి సంపద	
గోవులు	2,28,681
గేదెలు	46,017
గొర్రెలు	2,07,451
మేకలు	1,73,110

పశువుల పెంపకంపై అవగాహన

పశు విజ్ఞాన బడి కార్యక్రమం ద్వారా పాడి పశువుల పెంపకంలో మెలకువలు, యాజమాన్య పద్ధతులు, పశువుల్లో వచ్చే సీజనల్ వ్యాధులపై రైతులకు అవగాహన కల్పించారు. జీవాలకు టీకాలు వేసే సమయం తదితర వివరాలను పశువైద్య సహాయకులు రైతులకు వివరించారు. కృత్రిమ గర్భధారణపై పూర్తిస్థాయిలో తెలియజేశారు.

పాడి రైతులకు రుణ సదుపాయం

జిల్లాలో 3,673 కిసాన్ కార్డుల ద్వారా రైతులకు ఎలా రుణాలు ఇస్తున్నారో అలాగే పాడి రైతులకు కూడా కిసాన్ కార్డుల ద్వారా రూ.3 కోట్ల రుణాలు అందజేశారు. వెయ్యి మెట్రిక్ టన్నుల పశువుల దాణా, పశుగ్రాసం విత్తనాలు పాడి రైతులకు పంపిణీ చేశారు. పూర్తిస్థాయి సబ్సిడీతో సంపూర్ణ మిశ్రమ దాణా, 25 మెట్రిక్ టన్నుల పశుగ్రాస విత్తనాలు అందజేసి రైతులను ఆదుకున్నారు. జిల్లాలోని 306 ఆర్బీకేల పరిధిలో 30,100 మంది పాడి రైతులకు 1000 మెట్రిక్ టన్నుల దాణా పంపిణీ చేశారు. కేజీ రూ.14.50 ఉండగా సబ్సిడీ పోను రూ.6.50 ప్రకారం అందజేశారు. పశుగ్రాస విత్తనాలైన మొక్కజొన్న కిలో రూ.277 ఉండగా సబ్సిడీ పోను రూ.70, జొన్న రూ.437 ఉండగా సబ్సిడీ పోను రూ.110 లకే మొత్తం పశుగ్రాస విత్తనాలు పాడి రైతులకు అందజేశారు.

ఆర్బీకేల్లో పాడి రైతులకు అందించిన సేవలు

- ప్రాథమిక పశువైద్యం
- వ్యాధి నివారణ టీకాలు
- గొర్రెలు, మేకలకు నట్టల నివారణ కార్యక్రమం
- ఏడాదికి రెండు ఎఫ్ఎండీ వ్యాక్సిన్లు
- పశుగ్రాస విత్తనాల పంపిణీ
- సమీకృత పశుదాణా పంపిణీ
- ఎల్ఎల్ఎస్ఎస్ పశు నష్టపరిహారం

పాడి రైతులకు మేలు



పశు విజ్ఞాన బడుల ద్వారా పశువుల పెంపకంపై పాడి రైతులకు అవగాహన కల్పించారు. మాలాంటి పాడి రైతుల కోసం పశు విజ్ఞాన బడి ద్వారా అవగాహన కల్పిస్తున్నారు. మేకలు, గొర్రెల పెంపకానికి సంబంధించి మెలకువలు, పశువులకు వచ్చే వ్యాధుల నివారణ చర్యలను తెలుసుకున్నాం. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండేలా అవగాహన కల్పించారు.
– బడే కృష్ణమూర్తి పాడిరైతు, సంగంవలస

ప్రతి రైతుకు పశువిజ్ఞానం



పశుసంరక్షణ విజ్ఞానంపై ప్రతి పాడి రైతుకు అవగాహన కల్పించారు. ఈ బడులను ఆర్బీకేలలో నిర్వహించారు. పశు విజ్ఞాన బడి రైతులకు ఎంతగానో ఉపయోగపడుతుంది. పాడి సంపదపై అవగాహన కలిగించారు. ఆర్బీకేల్లో ప్రభుత్వ పథకాల ద్వారా వచ్చే దాణా, మందులు, గడ్డికోసే యంత్రాలను రైతులందరం సద్వినియోగం చేసుకుంటున్నాం.
– జి. శ్రీనివాసరావు, పాడిరైతు, పాలకొండ

‘పచ్చ’కుట్రలు పటాపంచలు

- సామాజిక పింఛన్ల పంపిణీలో సచివాలయ వ్యవస్థ విజయం
- సకాలంలో పింఛను అందించి లబ్ధిదారులకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం భరోసా
- జగన్‌మోహన్‌రెడ్డికి పేరు రాకూడదనే వలంటీర్ల వ్యవస్థకు చంద్రబాబు అడ్డంకులు
- వైఎస్సార్‌సీపీ డిప్యూటీ రీజినల్ కోఆర్డినేటర్ మజ్జి శ్రీనివాసరావు


మజ్జి శ్రీనివాసరావు

సాక్షి ప్రతినిధి, విజయనగరం: ప్రతి నెలా ఠంచనుగా ఒకటో తేదీన లబ్ధిదారుల ఇంటి తలుపు తట్టి ఐదేళ్లుగా పింఛను అందిస్తున్న వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వంపై ప్రతిపక్ష నాయకుడు చంద్రబాబు ‘పచ్చ’కుట్రలు పటాపంచలయ్యాయని వైఎస్సార్‌సీపీ డిప్యూటీ రీజినల్ కోఆర్డినేటర్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. వలంటీర్ల వ్యవస్థను అడ్డుకున్నా సామాజిక పింఛన్లను సకాలంలో అందించి సచివాలయ వ్యవస్థ విజయం సాధించిందని ప్రశంసించారు. శుక్రవారం ఆయన ‘సాక్షి’తో మాట్లాడారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే...

‘వృద్ధులకు, వితంతువులకు, దివ్యాంగులకు సామాజిక పింఛన్ల పంపిణీని ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొని విప్లవాత్మకమైన మార్పులు తీసుకొచ్చింది. వలంటీర్ల వ్యవస్థ, సచివాలయాల ద్వారా ప్రతి నెలా ఒకటో తేదీనే ఠంచనుగా పింఛనుగా అందిస్తూ వస్తోంది. వారి జీవనానికి ఒక భరోసా కల్పించింది. ఈ విధానం అనేక దేశానికే ఆదర్శప్రాయంగా నిలిచింది. దీన్ని కేంద్ర ప్రభుత్వం కూడా పరిశీలించింది. కొన్ని రాష్ట్రాల్లో అమలుచేయడానికి సాధ్యాసాధ్యాలపై ప్రత్యేక బృందాలొచ్చి అధ్యయనం చేశాయి. ఇదెక్కడ జగన్‌మోహన్‌రెడ్డికి పేరొస్తుందోనన్న అసూయతో చంద్రబాబు కుతంత్రాలకు ఆదిలోనే తెరలేపారు. వలంటీర్ల వ్యవస్థపై బురదజల్లారు. కించపరిచేలా దుర్భాషలాడారు. ఇవేవీ పట్టించుకోకుండా వలంటీర్లు సేవాదృక్పథంతో ప్రజలకు ప్రభుత్వ సేవలను చేరువచేయడానికి కష్టపడ్డారు. కరోనా మహమ్మారి విజృంభించినప్పుడు ఇదే చంద్రబాబు హైదరాబాద్ ప్యాలెస్‌లో తాళాలేసుకొని కూర్చుంటే వలంటీర్లు ఇక్కడ ప్రభుత్వానికి, అటు ప్రజలకు వారధిగా నిలిచారు. వైద్యసేవలు సత్వరమే అందించడానికి తమ వంతు సహాయసహకారాలు అందిస్తూ ఎంతోమంది ప్రాణాలు కాపాడారు. 14 ఏళ్ల ముఖ్యమంత్రినని, విజనరీనని చెప్పుకునే చంద్రబాబు గత టీడీపీ ప్రభుత్వంలో సృష్టించిన జన్మభూమి కమిటీలు ప్రభుత్వ సేవలందించే ముసుగులో తమ ప్రాణాలు ఎలా తోడేశాయో ప్రజలకు బాగా తెలుసు. అందుకే 2019 సంవత్సరంలో టీడీపీని తరిమికొట్టారు. జన్మభూమి కమిటీలకు ఎంతో భిన్నంగా ఉన్న వలంటీర్లను చూసి చంద్రబాబు కక్ష కట్టారు. నిమ్మగడ్డ రమేష్‌తో కేంద్ర ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేయించారు. వృద్ధులకు, దివ్యాంగులకు పింఛను అందించకుండా వలంటీర్లను దూరం చేశారు. ఇలా ఒక వ్యవస్థను ఛిన్నాభిన్నం చేసి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వానికి చెడ్డపేరు తేవాలని కుట్రకు తెరలేపారు. ఇది దురదృష్టకరం. చంద్రబాబు చేష్టలన్నీ ప్రజలు గమనిస్తున్నారు. రానున్న ఎన్నికల్లో మరోసారి కచ్చితంగా బుద్ధి చెబుతారు.

జగన్ విజన్‌కు నిదర్శనం...

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం తీసుకొచ్చిన సచివాలయ వ్యవస్థ, వలంటీర్ల వ్యవస్థ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విజన్‌కు నిదర్శనం. ప్రతి సచివాలయంలో 11 మంది ఉద్యోగులను, గ్రామాల్లో ప్రతి 50 కుటుంబాలకు, పట్టణాల్లో ప్రతి వంద కుటుంబాలకు ఒకరు చొప్పున వలంటీర్లను పెట్టారు. ప్రభుత్వ సేవలను, పథకాలను పైసా అవినీతికి ఆస్కారం లేకుండా అత్యంత పారదర్శకంగా అందించిన వ్యవస్థగా పేరొందింది. దీన్ని చెడగొట్టడానికి చంద్రబాబు కుట్రలకు తెరలేపారు. వృద్ధులు, దివ్యాంగులకు వలంటీర్ల ద్వారా పింఛను ఇంటివద్దనే అందుకోకుండా సైంధవుడిలా అడ్డుపడ్డారు. మండుటెండల్లో రోడ్లపైకి లాగి చంద్రబాబు తనలోనున్న సైకో మనస్తత్వాన్ని బయటపెట్టుకున్నారు. ఏదిఏమైనా సచివాలయాల ద్వారా పింఛన్ల పంపిణీని ప్రభుత్వం పూర్తి చేయడం హర్షణీయం. సచివాలయ ఉద్యోగులకు అభినందనలు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సచివాలయాల్లో కల్పించిన దాదాపు 1.30 లక్షల ఉద్యోగాలను ఇన్నాళ్లూ గుర్తించని చంద్రబాబే ఇప్పుడు ఆ సచివాలయ వ్యవస్థ ద్వారా పింఛన్లు పంపిణీ చేయాలన్నారంటేనే ప్రజాసేవ పట్ల వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ చిత్తశుద్ధి ఏమిటో చాటిచెబుతోంది. వలంటీర్ల వ్యవస్థను అడ్డుకున్న చంద్రబాబే తమ తప్పు నుంచి తప్పించుకోవడానికి ఖజానాలో డబ్బుల్లేవని, అందుకే పింఛన్ల పంపిణీ ఆలస్యమవుతోందని దుష్ప్రచారం చేశారు. కానీ లబ్ధిదారులందరికీ సచివాలయ వ్యవస్థ ద్వారా పింఛన్లు అందజేసి జగన్‌మోహన్‌రెడ్డి భరోసా కల్పించారు.

రామతీర్థంలో వైభవంగా సహస్ర దీపాలంకరణ


రామతీర్థంలో సహస్ర దీపాలను వెలిగిస్తున్న భక్తులు

నెల్లిమర్ల రూరల్:

సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థం శ్రీ సీతారామస్వామి దేవస్థానంలో సహస్ర దీపాలంకరణ కార్యక్రమాన్ని ఆలయ అర్చకులు శుక్రవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. వేకువజామున స్వామికి ప్రాతః కాలార్చన పూజలు నిర్వహించిన తరువాత యాగశాలలో నిత్య హోమాలు, వెండి మండపం వద్ద స్వామి కల్యాణ మహోత్సవాన్ని వైభవంగా జరిపించారు. సాయంత్రం 6 గంటలకు సీతారామస్వామి ఉత్సవ విగ్రహాలను ఊరేగింపుగా దీపారాధన మండపంపైకి తీసుకువచ్చి ప్రత్యేక ఊయలలో ఆశీనులు చేశారు. అనంతరం దీపాలు వెలిగించి ఊంజల్ సేవ జరిపించారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.